శ్రీ వరదరాజులస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయండి

- ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయము పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయం దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయము పునర్నిర్మాణ పనులను శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేవీ సాగర్ బాబు ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డులో వెలసిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంకి అనుబంధ దేవాలయమైన పురాణ ప్రసిద్ధమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులు గురించి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేవీ సాగర్ బాబు పునర్నిర్మాణ ఆధునీకరణ పనులను శరవేగంగా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఇప్పటికే ఆలయ పునర్నిర్మాణ పనుల్లో జరిగిన జాప్యాన్ని నివారిస్తూ ఇకపై ప్రతిరోజు యుద్ధ ప్రాతిపదికంగా పనులను నిర్వహించాలని ఆదేశించారు.15 లేయర్లు నిర్మాణ పనులకు సంబంధించిన టెక్నికల్ అనుమతులు లభించాయి కాబట్టి ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఇక ఎలాంటి పరిస్థితుల్లోనూ జాప్యానికి తావు లేకుండా పనులను శరవేగంగా చేయాలని కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. ప్రస్తుతం ఐదవ లేయర్ పనులు పూర్తి అయ్యింది కాబట్టి మిగతా లేయర్లు పనులను విభజించుకుని మూడు లేయర్లు పనులును విభజించుకుని మొత్తం 15 లేయర్లు పనులను వేగవంతం చెయ్యకపోతే రాబోయే రోజుల్లో కుంభాభిషేకం సమయానికి పూర్తి కాదని అధికారులకు కాంట్రాక్టుకు తెలియజేశారు. అదేవిధంగా 15 లేయర్లకు సంబంధించి రాతి బండలను స్కిట్ కాలేజ్ వద్ద చేరవేసి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అదేవిధంగా పునర్మాణ పనులను దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ అధికారులు పూర్తిగా ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ఇక్కడ ఉన్న పాత రాతిబండలు రబ్బిస్ యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని లోబావి నందు చేర్చాలని అధికారులకు ఆదేశం ఇవ్వడం జరిగింది. ఇప్పటివరకు జరిగిన జాప్యాని పునరావృతం అయితే కాంట్రాక్టర్ పైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈవో ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు సరిపోవడం లేదు శిల్పి కార్మికులను కూడా పెంచి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులతోపాటు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేవీ సాగర్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూక రత్నం, డిఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ కిషోర్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, సపతి కుమార్, కాంట్రాక్టర్లు యువ కిషోర్, విజయ భాస్కర్ రెడ్డి, దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో కుటుంబ సభ్యులకే ప్రాధాన్యం

- రాష్ట్ర "రెడ్డి" సంఘం వార్షికోత్సవ సభలో నవీన్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్ర రాజకీయాలలోనూ, ప్రభుత్వ - ప్రభుత్వేతర పదవుల్లోనూ కుటుంబ సభ్యులకు మాత్రం పదవులు ఇచ్చి రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని రాయల సీమ స్టీరింగ్ కమిటీ సహ అధ్యక్షుడు, పోరాట సమితి కన్వీనర్ అయిన పి.నవీన్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కులాలతో పాటు రెడ్ల సామాజిక వర్గానికి కూడా సముచిత గౌరవాన్ని, ప్రాధాన్యతను ఇచ్చే విధంగా పాలకుల్లో మార్పు రావాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో 5వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రెడ్డి సంఘం అధ్యక్షులు వైద్యలింగం, తిరుపతి - చిత్తూరు జిల్లాలలోని ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు, కడప - కర్నూల్ - అనంతపూర్ - గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రెడ్ల సంఘంలో కీలక పాత్ర పోషిస్తున్న నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రథమ భారత స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 14 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ,బహిరంగ సభ జనవరి 7న అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ దగ్గర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవ పోస్టర్ ను ముఖ్య అతిథులు, ప్రముఖులు ఆదివారం తిరుపతిలో ఆవిష్కరించారు. రెడ్డి అనేది ఒక కులం కాదని ఒక బ్రాండ్ అని నవీన్ కుమార్ పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కుటుంబ సభ్యులుగా, ఆత్మ బంధువులుగా భావించే గొప్ప నైజం రెడ్లలో ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగినప్పుడు రెడ్లను కేవలం ఓటు బ్యాంకుగా కొన్ని రాజకీయ పార్టీలు చూస్తున్నారే తప్ప రెడ్ల అభ్యున్నతికి, యువత భవిష్యత్ విషయంలో మొండి చేయి చూపిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ల సంఘం ఆత్మీయ సమావేశాలు ఎక్కడ జరిగినా కూడా రాజకీయ పదవులలో ఉన్న రెడ్లు హాజరు కాకపోవడం సరైంది కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర కుల సంఘాల సమావేశాలు జరిగినప్పుడు ఆ కులాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు, మంత్రులు బహిరంగ సభలలో పాల్గొని సంఘీభావం ప్రకటిస్తారని... మరి రెడ్ల సమావేశాలకు ఏ రెడ్డి ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు హాజరు కావడం లేదో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్డి సోదరులు ఆలోచించాలన్నారు. రెడ్లు అన్ని కులాల వారిని, మతాల వారిని గౌరవిస్తారని....అదే క్రమంలో తమ కులాన్ని అభిమానిస్తారని చెప్పారు.

30న ఖాదీ ఉత్సవం 2023 ప్రదర్శన , అమ్మకాలు

నగర ప్రజలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్థానిక ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ (ఎస్వార్ కన్వెన్షన్ హాల్). నందు ఈనెల 30వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఖాదీ వస్త్రాలు , గ్రామీణ ఉత్పత్తులు , హస్తకళలు , కలంకారి వస్త్రాలు , అగర్బత్తీలు , ఆయుర్వేద ఉత్పత్తులు తదితర వాటిని అమ్మకాలు , ప్రదర్శనశాల ను ఘనంగా రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్నాథ్ , ఆర్కే రోజా , ఉప సీఎం నారాయణస్వామి , టీటీడీ చైర్మన్ మరియు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఖాది మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ముఖ్య కార్య నిర్వహణాధికారి వీ.ఆర్. విజయ రాఘవ నాయక్ పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్క్లబ్లో ఆదివారం మీడియా ముందు ఆయన మాట్లాడుతూ.మహాత్మా గాంధీ 1917లో ఖద్దర్ క్లాత్ను సబర్మతి ఆశ్రమం లో చేనేత ద్వారా ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆనాటి కద్దరే నేటి ఖాది వస్త్రమని తెలియజేశారు.మంగళగిరి లో ఖాదీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ వారి సౌజన్యంతో.ఈ ప్రదర్శన, అమ్మకాలు పది రోజులు పైగా నిర్వహిస్తామని వెల్లడించారు.ఈనెల 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఆదరణ ఉంటే మరి కొద్ది రోజులు అమ్మ కాలను పొడిగిస్తామన్నారు తిరుపతి స్మార్ట్ సిటీ లో నివసిస్తున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని , ఎగ్జిబిషన్ ద్వారా ఐదు శాతం. వస్త్రాల తయారీదారుల ద్వారా మరో. పది శాతం డిస్కౌంట్ పొందవచ్చునన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి అధికారులు కోటిరెడ్డి, వెంకట్రాం , రమేష్ బాబు, ఆర్ ఎల్ ఎన్ మూర్తి , రవికుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కిలారి సురేంద్ర సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - చంద్రగిరి: సామాజిక స్పృహ కలిగిన కిలారి సురేంద్రన్ సేవలు అభినందనీయమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సీతారామిరెడ్డి తెలిపారు. చంద్రగిరి భారత్ నగర్ లో కిలారి సురేంద్ర నిర్వహిస్తున్న కిలారి శాంతి సురేంద్రన్ గ్రంథాలయంలో ఆదివారం స్థానికులు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సీతారామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధనార్జనే ప్రధానంగా పాటుపడుతున్న రాజకీయ నాయకులు సంస్థలకు విభిన్నంగా తాను సమాజానికి ఏదో సేవ చేయాలనే సంకల్పంతో సొంత నిధులతో కిలారి సురేంద్రన్ భారత్ నగర్ లో గ్రంథాలయం ఏర్పాటు చేసి ఆదర్శనీయుడుగా నిలవడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. స్వలాబేక్ష లేకుండా తన సంపాదనలో కొంతమేర ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సంఘసంస్కర్తలు సమాజానికి ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ఇతరులకు ఆదర్శప్రాయణీయం అన్నారు. తమ సొంత నిధులతో భవనం నిర్మించి నిర్వహణ కోసం ఓ నిరుద్యోగికి ఉపాధి కల్పించడంతోపాటు అన్ని రంగాల వారికి ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే నిజమైన ఆస్తి చదివేనని పేద తల్లిదండ్రుల పచ్చాన తన ఆదాయంలో కొంతమేర పేదపిల్లల భవిష్యత్తు కోరి ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటం తనకెంతో సంతోషంగా ఉందని కిలారి సురేంద్రన్ తెలిపారు. తరచూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచటానికి అనేక రకాల పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి తమ గ్రంథాలయం తరఫున బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు సురేంద్రన్ తెలిపారు. ఈ గ్రంథాలయాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళటానికి దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించటంతో పాటు గ్రంథాలయాన్ని వినియోగించుకోవలసిందిగా అతిథులు కోరారు. ఈ కార్యక్రమంలో కిలారి విక్రమ్, కిలారి తరుణ్, స్థానికులు ఈశ్వరాచారి, బైరెడ్డి మునిరత్నం, బైరెడ్డి మునిస్వాతి,వెంకటముని,వినోద్ కుమార్,చరణ్ కుమార్, గోపాల్,పాఠకులు స్థానికులు విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మాలో మరో కుంభకోణం- శుభం సమాఖ్యలో ఆర్పీ చేతి వాటం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో మరో కుంభకోణం వెలుగు చూసింది. శుభం సమాఖ్యలో ఓ రీసోర్స్ పర్సన్ చేతివాటం ప్రదర్శించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ అవినీతిపై విచారణ జరపాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు రాధమ్మ ఈ నెల 18వ తేదీన విచారణకు ఆదేశించారు. అయినా శ్రీకాళహస్తి మెప్మా అధికారులు ఇంతవరకు విచారణ నివేదికను ప్రాజెక్టు డైరెక్టరుకు అందజేయలేదు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే శ్రీకాళహస్తి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో కమ్యూనిటీ ఆర్గనైజరుగా విధులు నిర్వర్తించే అజుజున్నీసా నకిలీ రికార్డులు సృష్టించి నిబంధనలకు విరుద్ధంగా ఓ బ్యాంకు నుంచి రూ.20లక్షల రుణం పొందారు. ఈ అక్రమంపై 'విశాలాంధ్ర'లో కథనం ప్రచురితం కావడంతో మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు రాధమ్మ విచారణకు ఆదేశించారు. అధికారుల విచారణలో అవినీతి వెలుగు చూడటంతో కమ్యూనిటీ ఆర్గనైజరు అజుజున్నీసాపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటన నేపథ్యంలో సమాఖ్యల పనితీరుపై విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీన టీఈ-ఐబీ-డీపీఎంయూ వారు శ్రీకాళహస్తిలో స్లమ్ లెవెల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్) రికార్డులు పరిశీలించారు. ఇందులో భాగంగా శుభం ఎస్ఎల్ఎఫ్ కు సంబంధించి రీసోర్స్ పర్సన్ (ఆర్ పీ) పరిధిలోని సంఘాలను పరిశీలించగా... సంఘాల్లో రుణాల మంజూరు, తిరిగి చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. అదేవిధంగా సంఘ సభ్యుల నుంచి వసూలు చేసిన పైకం బ్యాంకులో చెల్లించకుండా... నగదు లావాదేవీలు చేస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఈ అక్రమాలపై విచారణ జరపాలని సదరు అధికారులు మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు రాధమ్మకు రాత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు మెప్మా పీడీ రాధమ్మ శ్రీకాళహస్తి సిటీ మిషన్ మేనేజరు ప్రసాద్ ను విచారణ చేయాలని ఆదేశించారు. ఈ విషయమై సీఎంఎం ప్రసాద్ ను 'విశాలాంధ్ర' వివరణ కోరగా శుభం ఎస్ఎల్ఎఫ్ రికార్డులు సరిగా నిర్వహించక పోవడంతో విచారణ అధికారులు రిమార్కులు రాశారన్నారు. నగదు లావాదేవీలకు సంబంధించి ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. కాగా ఐబీ అధికారుల పరిశీలనలో వెలుగు చూసిన అక్రమాలు సీఎంఎం విచారణలో వెలుగు చూడక పోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే సీఎంఎం ఇలా చెబుతున్నారనే విమర్శ వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి శ్రీకాళహస్తి మెప్మాలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని మెప్మా సంఘ సభ్యులు కోరుతున్నారు.

ప్రవచనం కాదు... ప్రజా వచనం కావాలి

వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభసభలో వక్తలు -వేమన పద్యానికి పట్టాభిషేకం ప్రదర్శన

'సమతా స్వాప్నికుడు వేమన' పేరిట పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : ప్రవచనాలు చెప్పేవారు చాలా మంది ఉన్నారు.. అయితే నేటి సమాజానికి ప్రజా వచనం చేప్పేవారు కావాలి.. కాలాని కంటే ముందు నడిచిన వ్యక్తి.. కాలంతో పాటు నడిచిన వ్యక్తి విశ్వకవి వేమన అని .. వేమన పద్యం వేగుచుక్క లెక్కన ఇప్పటికీ అందరినీ ప్రశ్నించేలా చేస్తుందని .... ప్రశ్నించాలంటే ధైర్యం కావాలని .. వేమన విజ్ఞాన కేంద్రం ఆ ధైర్యాన్ని నింపే కేంద్రంగా ఉండాలని' పలువురు వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి యశోదానగర్‌లో వేమన విజ్ఞాన కేంద్ర భవనాన్ని ఆదివారం ఉదయం ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు నేత పలవలి రామకృష్ణారెడ్డి పేరిట ఏర్పాటు చేసిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కుసుమకుమారి, ప్రముఖ అనువాదకులు ఎజి యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన సతీమణి ఎజి చంద్రమ్మలు ఆదివారం నాటి ఉదయం ప్రారంభించారు. అంతకుముందు టిటిడి పరిపాలనా భవనం నుంచి పెద్దఎత్తున వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు, సాహితీవేత్తలతో 'వేమన పద్యానికి పట్టాభిషేకం' పేరిట వేమన విజ్ఞాన కేంద్రం కార్యాలయం వరకూ పద్యాలను పాడుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విజ్ఞాన కేంద్రంలో వేమన పద్యభావన చిత్రలేఖన ప్రదర్శన పలువురిని ఆలోచింపజేసింది. 'ఒక సూర్యబింబం.. ఒక దీపస్తంభం.. ఒక జ్ఞానసంద్రం.. ఒక ధైర్య శిఖరం' అంటూ తిరుపతి బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన వేమన పద్య నృత్యరూపకం ఆహూతులను అలరించింది. సభకు తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించారు. ప్రారంభసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజానికి హేతుబద్ధ ప్రశ్నను నేర్పించిన కవి వేమన యని కొనియాడారు.దార్శనికునిగా, వాస్తవికంగా, పరిశోధనాత్మకంగా తన పద్యాలతో సామాన్యునికి పట్టం కట్టిన విశ్వకవి వేమన అని అన్నారు. పిరికితనం, మురికితనం పోవాలని, మానవతాదృష్టి పెరగాలని, ప్రస్తుతం సమాజానికి కావాల్సింది ప్రజావచనమని అన్నారు. ఆధునిక కవిత్రయమంటే వేమన, గురజాడ, శ్రీశ్రీ లేనని ఉద్ఘాటించారు. హేతుశీలత, మానవీయత, సామాజిక న్యాయం, ధిక్కారతత్వం, శ్రమ గౌరవం, ప్రతిఘటనల ప్రతిబింబం వేమన పద్యమని అన్నారు. అందుకే ఆయన జనప్రియుడని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఏర్పాటైన వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతిలో ఏర్పాటు చేయడం సముచితమని అన్నారు.కళలకు, కళాసాహిత్యానికి కేంద్రంగా ఈ సంస్థ పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 500 ఏళ్ల క్రితమే సమాజానికి ఉన్నతమైన విలువలతో కూడిన హితబోధలు చేసి నిజాన్ని నిర్భయంగా చెప్పిన కవి వేమనయని కొనియాడారు. నిజాన్ని నిక్కచ్చిగా తన పద్యరూపంలో తెగేసి చెప్పిన దార్శనీకుడని ఆయన అన్నారు. వేమన పద్యాలను సిపి బ్రౌన్ పరిశోధించి, పరిశీలించి, అనువదించి వెలుగులోకి తీసుకురాకుంటే బహుశా వేమన గొప్పతనం మనకు తెలిసుండేది కాదన్నారు. సమాజ హిత కార్యక్రమాలకు కేంద్రంగా వేమన విజ్ఞాన కేంద్రం ఉండాలన్నారు. పలవలి రామకృష్ణారెడ్డి కుమార్తె, మాజీ వైస్‌ఛాన్సలర్ కుసుమకుమారి మాట్లాడుతూ భౌతికవాద దృక్పథాన్ని సమాజానికి అందించిన గొప్ప కవి వేమనని, తన తండ్రి పలవలికి ఎంతో ఇష్టమైన కవి అని అన్నారు. తన తండ్రి పేరిట సభామందిరాన్ని ఏర్పాటు చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. త్వరలో కేంద్రంలో ఏర్పాటు కానున్న గ్రంథాలయానికి తన కుటుంబం తరపున రూ.50వేలను విరాళంగా ప్రకటించారు. ఎజి యతిరాజులు కుమారుడు ఎజి అరవింద్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, కులం, మతం, జాతుల పేరుతో విడిపోయి బలహీన పడుతున్న ప్రస్తుత తరుణంలో వేమన రచనలు అవసరమని అన్నారు. తన తండ్రి పేరుతో సమావేశ మందిరం ఏర్పాటు చేయడం మరచిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నటులు కాకరాల, రాయలసీమ సాహితీవేత్త భూమన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్, డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు కెవి చౌదరి, రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి, కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత పల్లెపట్టు నాగరాజు, విజ్ఞాన కేంద్రాల కోఆర్డినేటర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమా మహేశ్వరరావు, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొని ప్రసంగించారు.

గ్రామ స్వరాజ్యమా ..నీ అడ్రస్ ఎక్కడ?

- నిధులు లేక నిర్వీరమవుతున్న పంచాయతీలు-బాపూజీ కన్న కలలు గ్రామస్వరాజ్యానికి తూట్లు. కానరాని అభివృద్ధి.

విశాలాంధ్ర - చంద్రగిరి: ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గ్రామ స్వరాజ్యమా నీ అడ్రస్ ఎక్కడ? అని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిధులు లేక పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయి. బాపూజీ కన్న కలలైన గ్రామ స్వరాజ్యానికి తూట్లు పడుతున్నాయి. నియోజకవర్గం లో అభివృద్ధి శూన్యం. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు పక్కదారి పడుతుండటంతో పంచాయతీ అభివృద్ధి పనులు కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే కొట్టి మిట్టాడుతున్నాయి. తమ పంచాయతీల లో తాగు నీటి బోర్లు,మోటార్లు మరమ్మతులకు గురైతే సర్పంచులు సొంత నిధులు వెచ్చించి మరమ్మత్తులు చేయించాల్సిన పరిస్థితి. బిల్లులు ఎప్పుడు వస్తాయో దేవుడికే ఎరుక. మరమ్మతులు చేయించకపోతే పంచాయతీ ప్రజల నుంచి యిబ్బందులు ఎదుర్కోవాల్సింది వస్తుందనే భయాందోనలో సర్పంచులు ఉండటం దారుణం. మురికి కాలువలు నిర్మాణం లేక పల్లెలో నీరు నిలిచి దుర్గంధం, ఆ గాలి పీల్చి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలు. పంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టడంతో గ్రామ సర్పంచులు కొన్ని ప్రాంతాలలో పార్టీలకతీతంగా ధర్నాలు బిక్షాటన లు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఎట్టికేలకు ప్రభుత్వం దిగివచ్చి నామక వాస్తేగా 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడత మంజూరైనట్లు సమాచారం. పంచాయతీలో కరెంట్ చార్జీలు వారే భరించే పరిస్థితి. జనరల్ ఫండ్ రూపేనా వస్తున్న ఆదాయంతోనే పంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ్య పని వారికి జీతభత్యాలు సరిపెట్టాల్సి వస్తుందని అధికారులు అనధికారికంగా వాపుతున్నారు. ఏకగ్రీవమైన పంచాయతీల సంగతి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. నియోజకవర్గ కేంద్రం చంద్రగిరికి స్మశాన వాటిక లేకపోవటం విచారకరం, స్వర్ణముఖి నది వాగు ప్రాంతంలో శవాలను దహనం చేస్తున్నారు. తహసిల్దార్ కార్యాలయం నిర్మాణం పూర్తయినా గుత్తేదారు కు బిల్లు చెల్లించక ప్రారంభానికి నోచుకోలేదు. ఎంపిడిఓ కార్యాలయం భూమి పూజకే పరిమితం అయింది. మార్కెట్ యార్డ్ లో షాపింగ్ కాంప్లెక్స్ పనులు అర్ధాంతంగా నిలిచిపోయినా పట్టించుకొనే నాదుడే లేరు. ఇకపోతే మండలంలో గతంలో ఉన్న 33 పంచాయతీలను ప్రస్తుతం 21కి కుదించారు. మండలంలో ఈ పంచాయతీలకు తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు ఒకరిద్దరే కావటం విశేషం. అలాగే 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్న ఈ మండలంలో తెలుగుదేశం పార్టీ ఒక్కరంటే ఒక్క సభ్యుడు కూడా లేకపోవడం విచారకరం. లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి పదవులు పొందిన సర్పంచులు గాని ఎంపిటిసిలు గాని వారి ఐదు సంవత్సరాల కాలంలో నిధులు మంజూరు కాకపోవటంతో ఉసూరు మంటున్నారు. అందరూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులే కావటంతో మండలం సమావేశాల్లో నోరు విప్పి మాట్లాడలేక మదనపడుతు లోపల తీవ్ర మనోవ్యధకు గురవుతున్నారు. గతంలలో జెడ్పీటీసీ ఎంపిపి లకు నిధులు మంజూరు అయ్యేవి. ప్రస్తుతం ఆ ఊసే లేదు. మండలంలోని అంగన్వాడి మినీ అంగన్వాడీ కేంద్రాలకు చాలా వరకు సొంత భవనాలు లేవు. కొన్ని కేంద్రాలు తుడా నిధులతో నిర్మించిన రిసెప్షన్లో నడుపుతున్నారు. ఇక సంక్షేమ వసతి గృహాల్లో మౌళిక వసతులు లేక పేద విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల విలీనంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. నిధులు లేక గ్రామీణ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చినుకు పడితే చిత్తడే గతంలో కురిసిన వర్షాలు కు దెబ్బతిన్న రోడ్లు కల్వర్టులు పూర్తిస్థాయిలో మరమ్మతులు కు నోచుకోలేదు. ఓ పక్క నిరుద్యోగ సమస్య తాండవిస్తోంది. పెద్ద పెద్ద చదువులు చదివిన యువకులు ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. కొంతమంది నిరుద్యోగులు ఉద్యోగం లేదనే వ్యసనంతో మద్యానికి బానిస అవుతున్నారు. నాసిరకం మద్యం కుటుంబాలను కూల్చివేస్తున్నాయి. నియోజకవర్గం లో అనేక సమస్యలు తాండవిస్తూ అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉంటున్న చెవిరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులకు కొరత కావడంతో ఆయన కొంతమేర లోలోపల మనోవేదనకు గురు అవుతున్నారని సమాచారం.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి ఆదివారం సాయంత్రం విలేకర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో చంద్రబాబు రూ.3000 కోట్ల అవినీతి చేశాడని నిన్నటి వరకు ఆరోపించిన జగన్ రెడ్డి, ఆయన ముఠా తర్వాత రూ.270 కోట్లు అన్నారు. ఇప్పుడు రూ.27 కోట్లు అంటూ ఎలక్టోరల్ బాండ్స్ చూపిస్తున్నారు. జగన్ ముఠా పిచ్చి ప్రయత్నాలు చూసి నవ్వాలో ఆశ్చర్యపోవాలో జాలిపడాలో అర్థం కావడం లేదని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి అన్నారు. ఈ మేరకు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పుత్తూరు మున్సిపాలిటీ మిట్టపల్లూరు ఆది ఆంధ్రవాడ లో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చే స్కిల్ ప్రాజెక్టుపై ఆరోపణలు చేసి చంద్ర బాబుని అరెస్టు చేసిన జగన్ రెడ్డి అవినీతి నిరూపించలేక నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఎలాగో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని తెలిసి తన లాగానే చంద్రబాబు కూడా కొన్ని రోజులైనా జైలు జీవితం గడపాలనే కుట్రతోనే అక్రమంగా అరెస్టు చేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, సంతోష్ పండారం మణిరెడ్డి చిరంజీవి,మహేష్, అర్ముగ రెడ్డి, గోపాల్, నారాయణ, సుబ్రమణ్య రెడ్డి,కొప్పారెడ్డి, దశరథన్, ఉమాపతి,లోకేష్, వెంకటముని, పశుపతి, గోపి, మణి రెడ్డి, సంతోష, గణేష్, భాస్కర్,మురుగేష్ రెడ్డి,అర్జున్ రెడ్డి, గోవింద్ స్వామి, యానాద్ రెడ్డి చంద్రశేఖర్, నారాయణ, గోపాల్, దిలీప్ రెడ్డి, మణి రెడ్డి,ఉమాపతి, శశి కుమార్ రామచంద్ర రాజమ్మ దసమ్మ పునిదా చిరంజీవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జగనాసురిడికి కళ్లు తెరిపిద్దాం

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగనాసురిడి పాలనను అంతమొందిద్దామని పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముమ్మడి ఉషారాణి ఆధ్వర్యంలో కళ్యాణపురంలో జగనన్న కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకుని జగన్ కళ్లు తెరిపించాలి నిజం గెలవాలి అని నినాదాలు చేసారు ఈకార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీఎన్టీయూసీ అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు, పుత్తూరు రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, టీడీపీ నాయకులు క్రిష్ణకుమార్, సుబ్రమణ్యం నాయుడు, కన్నన్, గోపీనాథ్, శంకరాచ్చారి, రాము లక్ష్మీ, పెంచలయ్య, గౌస్ వేలు భాను వినీత్, హేమంత్ శీనా తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభ

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాదులో జరిగే విశ్వరూప మహాసభ విజయవంతం చేయడం కోసం గ్రామ గ్రామానికి వెళ్లి మనం మాదిగలను చైతన్యం చేసి మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ మాదిగ అన్నగారు చేస్తున్నటువంటి పోరాటాలను నగిరి నియోజకవర్గ ఎం ఎస్ పి ఇంచార్జ్ శివయ్య మాదిగ వివరించడం జరిగినది. అదేవిధంగా మన మాదిగలంతా హైదరాబాదుకు త్వరలో వచ్చి జరగబోయే విశ్వరూప మహాసభను దిగ్విజయంగా చేయాలని వివరించారు ప్రస్తుతం వర్గీకరణ లేనంతవలన మన మాదిగలు ఇంతవరకు ఎంత నష్టపోయారో వివరించారు .అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ చివరి దశకు చేరుకున్న కారణంగా ఈ 29 సంవత్సరాలు చేసిన పోరాటం ఒక ఎత్తు అయితే ఈ చివరి దశలో చేస్తున్న పోరాటం ఒక ఎత్తు ఈ పోరాటాన్ని చాలా ఉధృతం చేసి గ్రామాల నుంచి ప్రతి ఒక్కరు తరలి వచ్చి చివరి దశలో జరుగుతున్న ఈ విశ్వరూప మహాసభను విజయపథంలో నడిపించాలని వివరించారు వడమాల పేట మండలంలోని బుట్టి రెడ్డి కండ్రిగ బంగారెడ్డి కండిగ వెంకటరెడ్డి కండ్రిగ బాలి నాయుడు కండ్రిగ, సీతారామపురం అబ్బీ కండ్రిగ గ్రామాలలో కరపత్రాలను గడపగడపకు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో వడమాల పేట మండల యంఆఎఫ్ ప్రసాద్ మాదిగ ఎం ఎస్ పి ఇన్చార్జ్ తిత్తులూరి వెంకట హరి ప్రసాద్ మాదిగ ప్రధాన కార్యదర్శితులసీ రామ్ మాదిగ ఉపాధ్యక్షుడు పర్రి గోవిందరాజులు మాదిగ పరశురాం మాదిగ నాగభూషణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వారిపై కేసులు పెట్టాలి

ఈయూ, ఎస్ డబ్ల్యూఎఫ్ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర - గూడూరు : కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై దాడికి పాల్పడిన దుండగులపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని ఈయూ, ఎస్ డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. నిరంతరం రాత్రి అనక పగలనక, వాన అనక, ఎండనక, పండగ పబ్బాలు విడిచి ప్రయాణికుల రవాణా సౌకర్యాన్ని అందించేందుకు విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులు పెరగడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ఎస్డబ్ల్యూఎఫ్ డిపో నాయకులు నారాయణ ఈయూ అధ్యక్షులు, సుబ్బారావు, కార్యదర్శి, డిపో గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం రాజు, కడప జోన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఈవీ. కుమార్, డిపో అధ్యక్షులు రాము, డిపో గ్యారేజ్ కార్యదర్శి రమణయ్య, కడప జోన్ పబ్లిసిటీ సెక్రటరీ కేవీఎస్. వాసులు తదితరులు పాల్గొన్నారు.

పనపాకంలో చెవిరెడ్డి పెళ్లి కానుక పంపిణీ

విశాలాంధ్ర - చంద్రగిరి: నూతనంగా పెళ్లి చేసుకున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లు తన సొంత నిధులతో పెళ్లి కానుకను అందజేశారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో ఆదివారం సాయంత్రం స్థానిక నాయకుల చేతుల మీదుగా వారు పెళ్ళికానుకను అందజేశారు. బోడిగుట్ట వారి పల్లెలోని చారాల మునిరత్నం,పార్వతి దంపతుల కుమారుడు వరుడు మోహన్ లకు బంగారు తాళిబొట్టు,బాసికాలు,వెండి మెట్లు, పట్టు బట్టలు,తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు, కాబోయే దంపతులు కలకాలం సంతోషంగా ఉండాలని నాయకులు వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పంచాయతీ పార్టీ అధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, వైఎస్ఆర్సిపి నాయకులు సిహెచ్ రెడ్డప్ప,కసా గోపాల్, నాగభూషణం, భాస్కర్,అజయ్ కుమార్,వినోద్ కుమార్, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో చంద్రగిరి వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆదివారం చేపట్టిన గడప గడపకు మాహా పాదయాత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ప్రతి గడపకు వెళ్ళిన మోహిత్ రెడ్డికి సొంత గ్రామం కావడంతో ప్రజలు కుటుంబ సభ్యుడిలా ఆహ్వానించి ఆత్మీయంగా మాట్లాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుమ్మలగుంట పంచాయతీలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విశదీకరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సర్వతో ముఖాభివృద్ధి చెందిన తుమ్మలగుంట ఆదర్శంగా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సంకల్పించారన్నారు. ఇందుకు దివంగత మహా నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తి ప్రదాతగా పేర్కొన్నారు. కరోనా సమయంలో ఎవరూ చేయనంతగా ప్రాణాలను పణంగా పెట్టి తనను నమ్మి ఎన్నుకున్న ప్రజలకు అండగా నిలిచి భరోసా కల్పించారని తెలిపారు. నిత్యం నియోజకవర్గ ప్రజల కోసం పరితపించే నాయకుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడిగా తాను ఎంతగానో గర్వపడుతున్నానని మోహిత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోనే తుమ్మలగుంటకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని తెలియజేశారు. అండగా నిలిచి ఆశీర్వదించాలని గడప గడపలో ప్రతి ఒక్కరికీ విన్నవించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన వినతులు స్వీకరించారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - రామకుప్పం : వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విఫలంకావడంతో యువత కు తీరని అన్యాయం జరిగిందని తెలుగు దేశం పార్టీ కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగం కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి మరియు మండల తెదేపా అధ్యక్షుడు ఆనందరెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని పంద్యాలమడుగు మరియు పీఎంకే తాండా పంచాయితీలకు సంభందించిన తెలుగు యువత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యువత అన్ని రంగాల లో అభివృద్ధి చెందేలా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవడమే కాకుండా కుల వృత్తులు వారికి నాణ్యమైన పనిముట్లు అందించి వారికి ప్రోత్సాహం కల్పించడం జరిగిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో యువతకు స్వయం సహాయక రుణాలు గానీ కుల వృత్తుల వారికి పనిముట్లు సైతం ఆగిపోయాయన్నారు. ఈ విషయాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అదేవిధంగా రానున్న శాసనసభ ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడిని లక్ష ఓట్ల మెజారిటీ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, యూనిట్ ఇంచార్జి గంట్లప్ప గౌడు, మరియు తెదేపా నాయకులు వెంకటేష్, కన్నన్, త్యాగరాజనాయుడు, శ్రీనివాసులు గౌడు, మునిరాజు నాయక్, సుధాకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఓదార్చిన డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర - కార్వేటినగరం: నియోజకవర్గంలో వివిద కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఆదివారం ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పరామర్శించారు. పెనుమూరు మండలం రాజా ఇండ్లు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ వైస్ ఎంపీపీ(2) దూది అరుణ శనివారం గుండెపోటుతో మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం గ్రామానికి వెళ్లి వైస్ఎంపీపీ అరుణ మృత దేహంపై పూల మాల వేసి నివాళులు అర్పించారు. కొల్లాగుంట గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి రామ్ (35) మృతి చెందినట్లు సమాచారం అందుకున్న మంత్రి గ్రామానికి వెళ్లి రామ్ మృత దేహంపై పూలమాల వేసి నివాళులుఅర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చారు. అదే విధంగా మంత్రి స్వగ్రామం పాదిరికుప్పం గ్రామానికి చెందిన బాలమ్మ(68) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో నారాయణస్వామి గ్రామానికి వెళ్లి ఆమె మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట దూది మోహన్, సుధాకర్రెడ్డి. సర్పంచ్ దివ్య, పలువురు వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు.

దూది అరుణ మృతి పార్టీకీ తీరని లోటు

దూది అరుణ మృతి పార్టీకీ తీరని లోటని చిత్తూరు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు అన్నారు. దూది అరుణ మృతి చెందినట్లు సమాచారం అందుకున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు రాజా ఇండ్లకు చేరుకుని వైస్ ఎంపీపీ మృత దేహంపై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అలాగే వారి కుటుంబాన్ని ఓదార్చారు.

నారా లోకేష్ను కలిసిన డీకే ఆదికేశవ నాయుడు దంపతులు

పలమనేరు-విశాలాంధ్ర: హైదరాబాదులో ని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను ఆదివారం డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబ సభ్యులైన ఆది కేశవులు చైతన్య డాక్టర్ రాజేష్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వారు ఖండించారు. చంద్రబాబు నాయుడు సతీమణి చేపడుతున్న నిజం గెలవాలి అందుకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లువారు తెలిపారు.అనంతరం నారా లోకేష్కు పూల బుకే అందించి శాలువతో సన్మానించారు. వారు కొద్దిసేపు లోకేష్ తో చర్చించారు. అనంతరం శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి మాజీ బోర్డు చైర్మన్ గురవయ్య నాయుడు, పలమనేరు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పగడాల ప్రవీణ్ కూడా నారా లోకేష్ కు పూల బొకే అందించారు.

పేదలకు సేవలు అందించడమే సత్యాఫౌండేషన్ లక్ష్యం

విశాలాంధ్ర - కార్వేటినగరం:పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టడమే సత్యాఫౌంషన్ లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ .క్రిష్ణయ్య అన్నారు. ఆధివారం మండలపరిధిలోని పాదిరికుప్పం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. అనంతరం పాదిరికుప్పం, గోపిశెట్టిపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులకు, వికలాంగులకు, పేదలకు 50 మందికి చీరలు, పంచలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభువు యొక్క మార్గంలో నడుచుకుంటూ పేదలకు అండగా సత్యాఫౌండేషన్ ఉంటుందని తెలిపారు. అలాగే అనాధ శరణాలయాలు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధాశ్రమాలకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యాఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు సత్యవేణి, పాస్టర్ సేవా పీ.చార్లెసెవెస్లీ, పలువురు ఉపదేశకులు పాల్గొన్నారు.

సౌమ్య ఇండేన్గ్యాస్లో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం

పలమనేరు-విశాలాంధ్ర: స్థానిక పట్టణంలోని సౌమ్య ఇండే న్ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా లబ్దిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ల కొరకు దరఖాస్తు స్వీకరించబడునని యజమాని భాస్కర్ తెలిపారు. ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారు ఉచిత గ్యాస్ కనెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. గ్యాస్ కనెక్షన్ లేనివారు ఉంటే వారు రేషన్ కార్డులో 18 సంవత్సరాలు నిండిన వారి భర్త ఆధార్, భార్య బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డ్ రెండు ఫోటోలు, ఆధార్కు లింక్ అయినాఫోన్ నెంబర్ ఇవ్వాలని తెలిపారు.

రాష్ట్ర కిసాన్ మార్కెట్ యార్డ్ కన్వీనర్గా నటింపల్లి యువరాజ్

విశాలాంధ్ర - కార్వేటినగరం : రాష్ట్ర కిసాన్ మోర్చా మార్కెట్ యార్డు సెల్ కు కన్వీనర్గా నటింపల్లి యువరాజును రాష్ట్ర కిసాన్ అధ్యక్షులు సి. కుమారస్వామి,రాష్ట్ర బిజెపి అధ్యక్షులు శ్రీమతి పురందేశ్వరి జిల్లా కిసాన్ అధ్యక్షులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 35 సంవత్స రాలుగా బిజెపిలో ఉంటూ ఎన్నో కార్యక్రమాలు చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయడం జరిగిందన్నారు. తిరుపతి ఎంపీగా వెంకటస్వామి విజయానికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. బిజెపి పార్టీ మొల్లపేతానికి ఎంతో కృషి చేసినందుకు ఈ పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవితో మరింత బాధ్యత పెరిగిందని రాష్ట్రంలో దేశంలో 2024 లో బిజెపి అధ్యక్షులు విజయానికి కృషిచేసి మరలా భారతదేశానికి ప్రధాని మంత్రిగా నరేంద్ర మోడీ రావడం జరుగుతుందన్నారు. యువరాజుకు పదవి రావడంపై కార్వేటినగరం బిజెపి మండల అధ్యక్షులు రామ్ శెట్టి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు శునకానికి ఘనంగా దహన క్రియలు

విశాలాంధ్ర- చిత్తూరు: జిల్లాపోలీస్ శునకం అయిన జెస్సి దహన క్రియలను జిల్లా పోలీస్ శాఖ ఆదివారం ఘనంగా నిర్వహించింది. చిత్తూరు పట్టణంలోని డాగ్ స్క్వాడ్ విభాగం ఆవరణలో జెస్సి అనే పోలీస్ శునకం ఆదివారం క్యాన్సర్తో మరణించింది. దాదాపు తొమ్మిది ఏళ్ళ పాటు పోలీసు డిపార్టుమెంటుకు సేవలందించిన జెస్సి ఆదివారం తుదిశ్వాస విడిచింది. చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు పర్యవేక్షణలో దహన క్రియలను ఆర్ఐ అడ్మిన్ నీలకంటేశ్వర రెడ్డి పోలీస్ డాగ్ స్క్వాడ్ యూనిట్ నందు నిర్వహించారు. ఆర్ఐ జెస్సి కి శాలువా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ పోలీసు విధుల్లో జెస్సి చేసిన సేవలను కొనియాడారు. పలు కేసుల దర్యాప్తుల్లో జెస్సి చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఐ రాంమోహన్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జి ఏఆర్ ఎస్ఐ రఘు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పలమనేరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చెక్ పోస్ట్ వద్ద చోటుచేసుకుంది జాతీయ రహదారిపై చెక్ పోస్ట్ వద్ద రోడ్డు ప్రమాదంజరిగింది.బైకును వెనుక వైపు నుండి ఢీకొన్న కారు ఇందులో అతివేగంగా కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలోగుణ శేఖర్(35)సం మృతి చెందాడు మణి అనే మరొక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డ వ్యక్తిని108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వీరిద్దరూ బంగారుపాల్యం మండలం ఊటవంక గ్రామ వాసులుగా పోలీసులు గుర్తించారు.పోలీసుల కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు సిపిఐ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించిన జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర- చిత్తూరు : తమిళనాడు రాజధాని చెన్నైలోని టీ.నగర్ లోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయంపై కొంతమంది దుండగులు దాడి చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజన్ తీవ్రంగా ఖండించారు . చెన్నైలోని పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతున్న సమయంలో రాళ్లతో, మద్యం సీసాలతో దాడి చేయడం శోచనీయమన్నారు, దాడి చేసిన వారిని అరెస్టు చేయడమే కాకుండా వీరి వెనుక ఉన్నటువంటి పాత్రధారులను, సూత్రధారులను గుర్తించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వాన్ని పోలీస్ ఉన్నత అధికారులకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సభ్యులు, సిపిఐ చిత్తూరు డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఎస్. నాగరాజన్, చిత్తూరు జిల్లా చిత్తూర్ డిస్టిక్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మెంబర్స్ వి.సీ .గోపీనాథ్ ,దాసరి చంద్ర, పార్టీ సీనియర్ నాయకులు డిస్టిక్ కౌన్సిల్ నెంబర్ కే.మణి,పి .గజేంద్రబాబులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

బీసీ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు

విశాలాంధ్ర -చిత్తూరు: వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం చిత్తూరు నగరంలోని బీసీ భవన్ నందు చిత్తూరు నియోజకవర్గ వన్నియకుల క్షత్రియుల సమావేశం తిరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వము చేపట్టని సంక్షేమ కార్యక్రమాలు నేడు అమలు అవుతున్నాయని కావున బీసీలు ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రెండో తేదీన చిత్తూరులో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిత్తూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బీసీలకు అండగా ఉంటున్న జగన్ ప్రభుత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు భూపేష్ గోపీనాథ్, జ్ఞాన జగదీష్ అధిక సంఖ్యలో వన్నియ కుల క్షత్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంచార జాతుల కుల వృత్తులలో నైపుణ్యం పెంచుకోవాలి

సంచార జాతుల వారు సొసైటీలుగా ఏర్పడాలి- భరత్భాయ్ బాబుభాయ్ పట్నీ

విశాలాంధ్ర -చిత్తూరు : సంచార జాతుల వారివారి కుల వృత్తుల లో నైపుణ్యం పెంచుకోని కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని డి-నోటిఫైడ్, సంచార సెమీ సంచార కమ్యూనిటీల అభివృద్ధి సంక్షేమ బోర్డు సభ్యుడు భరత్భాయ్ బాబుభాయ్ పట్నీ పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు పట్టణంలోని ప్రైవేట్ కళ్యాణ్ మండపం నందు జిల్లాలోని సంకరజాతుల కులాల వారి అభివృద్ధి కొరకు నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల కుల గణన చేయాలి, యం బి సి కార్పోరేషన్ ద్వారా సంచార జాతుల వారికి రుణాల మంజూరు చేయాలని, సంచార జాతుల వారికి గృహ నిర్మాణం లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల తో సంచార జాతుల కులాలు వారి వృత్తి నైపుణ్యం ను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలందరిని చదివించుకోన్నచో కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, విశ్వకర్మ యోజన పథకం ను అర్హులైన కుటుంబాలు ఉపయోగించుకోని అభివృద్ధి చెందాలన్నారు. సంచార జాతుల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలన్నది కేంద్ర ప్రభుత్వం యొక్కముఖ్య ఉద్దేశంని తెలిపారు.ఇటీవల తిరుపతి, చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాలందు పర్యటించి సంచార జాతుల్లో వారి జీవన విధానం వారి సాధకబాధలను వారిని అడిగి తెలుసుకోవడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం సంచార జాతులకు అములు పరుస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వారికి వివరించడం,కేంద్ర ప్రభుత్వం అందజేసే సంక్షేమ ఎలా పొందాలన్న వివరాలను వివరించడం జరిగిందన్నారు. ఇక్కడ సంచార జాతుల స్థితిగతులు తెలుసుకోవడం జరిగిందని దీనికి సంబంధించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం సభ్యులు మాట్లాడుతూ సంచార జాతుల కులాల వారిగా జనాభా వివరాలు సేకరించాలన్నారు.సంచార జాతుల సమస్యలు గురించి అసెంబ్లీగాని పార్లమెంటులో గాని చర్చించే నాయకులు లేరని సంచార జాతర కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సంచార జాతుల వారిపై జరిగే దాడులు సంబంధించి అట్రాసిటీ కేసులు నమోదు అయ్యియేల ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కోరారు.ప్రతి జిల్లాలో డి నోటిఫైడ్ బోర్డు ఏర్పాటు చేసి అందులో 5 మంది సభ్యులు నిర్ణయించాలని కోరారు.సంసార జాతర సంక్షేమ అభివృద్ధి కోసం బోర్డు ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి కేంద్ర ప్రభుత్వానికి చిత్తూరు జిల్లా సంచార జాతుల అందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,వివిధ జిల్లా సంచార జాతుల సంఘం నాయకులు,వెంకటేశ్వర్లు ,పి.కుమార్ మహీంద్ర, చిత్త రంజన్,డోల కృష్ణ, డాక్టర్ ఫణీంద్ర, మధుసూదన్, జయలక్ష్మి, సంచార జాతుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సౌకర్యం కోసమే బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు

జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి

విశాలాంధ్ర - గంగాధరనెల్లూరుః వినియోగదారుల సౌకర్యం కోసమే మారుమూల ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలంలో పాచిగుంట వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ పనులను ఆదివారం పరిశీలించి అనంతరం తూగుండ్రం గ్రామాల సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే , ప్రజల నుండి వచ్చిన వినతి పత్రాలు పరంగా, అదేవిధంగా బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పరిశీలన మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా మొబైల్ సిగ్నల్ లేని చోట్ల కొత్త గా బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు . అదేవిధంగా ఫైబర్ నెట్ కనెక్షన్ ద్వారా రూ.399, రూ.499,రూ.599 కనెక్షన్ లు పొందితే ఇంటర్ నెట్, కాల్స్ సౌకర్యం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ సురేంద్రనాథ్, సబ్ ఇంజనీర్ శ్రీనివాసులు, జెటిఓ సిద్దయ్య, ఐఎస్ఆర్ జెఈ నర్సింహారెడ్డి , లైన్ మెన్ జీవరత్నం పాల్గొన్నారు.

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

పలమనేరు-విశాలాంధ్ర: రూరల్ మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి,దిగువ కల్లాడు, ఎగువ కల్లాడు,మాదిగ కల్లాడుచెన్ను పల్లిదిగువ మారమూరు పాలమాకుల పల్లి, మాదిగ బండ ఎర్రగుండే పల్లి, గుండ్లపల్లి, ఎస్.ఆర్.పురం, అయ్యంరెడ్డిపల్లి, కొరుమాకులపల్లిలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే మినీ మేనిఫెస్టోను వివరిస్తూ ఆయన ఈ పర్యటన సాగించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ఆయనకు ఘన స్వాగతం తెలియజేశారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు పట్టగా యువత గజ మాలలతో సత్కరించారు. మరోవైపు జన సైనికులు సైతం ఆయనకు మద్దతు తెలిపి పర్యటనలో ఆయన వెంట నడిచారు. ఇక పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు మాజీ మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎగువ కల్లాడు గ్రామానికి చెందిన హరినాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి లతోపాటు చిన్న పల్లి గ్రామానికి చెందిన భాస్కర్,శ్రీకాంత్ తదితరులుతెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాలలో పలమనేరు మండల నాయకులు కార్యకర్తలతో పాటు జనసైనికులు పాల్గొన్నారు.

టెంపో వాహనం దగ్ధం

పలమనేరు-విశాలాంధ్ర: టెంపో వాహనం దగ్ధమైన సంఘటన ఆదివారం దొరచెరువు వద్ద చోటుచేసుకుంది. పలమనేరు జాతీయ రహదారి దొర చెరువు వద్ద గూడ్స్ టెంపుల్ వాహనం దగ్ధమైంది. రాజమండ్రి నుండి బెంగళూరుకు పూల మొక్కలు తీసుకెళ్తున్న వాహనంహఠాత్తుగా క్యాబిన్లో మంటలు చెలరేగడంతో ఘటన జరిగింది. డ్రైవర్ రోడ్డు ప్రక్కకు వాహనాన్ని ఆపివేశారు. అనంతరం అగ్ని శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే వచ్చి వాహనంలోని మంటలను అగ్నిమాపక శాఖ అధికారులు అదుపు చేశారు.

పోలీస్ స్టేషన్లో హాజరైన పుంగనూరు టిడిపి నేతలు

పలమనేరు-విశాలాంధ్ర: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా పుంగనూరుకు రావడం తో జరిగిన సంఘటనలో పుంగనూరు పోలీసులు టిడిపి నేతలపై కేసులు పెట్టడంతో హాలో టిడిపి నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం జరిగింది రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం లో అడ్వాన్స్ బెయిల్ కు ఆశ్రయించడంతో రాష్ట్ర హైకోర్టు టిడిపి నేతలకు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగా టిడిపి నేతలు ఆదివారం రోజున పీలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లి సంతకాలు పెట్టి రావడం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ వాయల్పాడు మండల అధ్యక్షులు మల్లికార్జున నాయకులు ఎస్ బాబు పర్వేజ్ రెడ్డప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళ్ళకు గంతులు కట్టుకొని టిడిపి నిరసన

విశాలాంధ్ర - కార్వేటినగరం : కళ్ళకు గంతులు కట్టుకొని తెలుగు తమ్ముళ్లు ఆదివారం రాత్రి 7 గంటలకు గాళ్ళమెట్ట కూడలి వద్ద చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిజం గెలవాలి అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ్ యాదవ్ మాట్లాడుతూ అరాచక పాలనను సాగ నంపాలని పిలుపునిచ్చారు. బాబును అరెస్టు చేసి 51 రోజులు గడుస్తున్నా అతీకతి లేదని న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని విశ్లేషకులు మేధావులు అంటున్నారని పేర్కొన్నారు. 20 24 లో రాష్ట్రంలోటిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం తధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వాసుదేవ రెడ్డి, జీడి నెల్లూరు బీసీ సంఘం అధ్యక్షుడు రవి యాదవ్, నాయకులు నౌషాద్ దాము, ధనంజయ వర్మ, చంగల్ రాయల్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

విశాలాంధ్ర - పుంగనూరు: మండలంలోని మంగళం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రైతన్నలకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఆదివారం రోజున మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇచ్చే పనిముట్లను ఈరోజు పంపిణీ చేశారు. ఈ వ్యవసాయ పనిముట్లు రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లడం వలన రాష్ట్రంలో ఉన్న రైతన్నలు కు వ్యవసాయం లాభసాటిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజారెడ్డి ఎంపీటీసీ రామ్మోహన్ రెడ్డి సచివాలయ కన్వీనర్లు గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి-నా దేశం

విశాలాంధ్ర- వరదయ్యపాలెం : సత్యవేడు నియోజకవర్గం నుండి స్వచ్చత్ రూరల్ అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మావుదురు మోహన్ చిత్తూరు ఉమ్మడి జిల్లాల నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించి న్యూఢిల్లీ ప్రయాణ సంధర్భంగా ఆయన కలిశాన్ని తీసుకొని ఆయన టీమ్ 30మంది ప్రయణం జరిగింది ,ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ,నా మట్టి నా దేశం అనే కార్యక్రమం దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన నేల తల్లికి నమస్కారాలు - వీరులకు వందనం అనే నానుడితో దేశం కోసం రాజధాని డిల్లీలో 600 వందల ఎకరాలలో స్మృతి వనం నిర్మాణం చేపట్టిన ప్రధాన నరేంద్ర మోదిజీ ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా భాగస్వామ్యం కావాలని కోరిక మేరకు భారతదేశం మొత్తం నా మట్టి నా దేశం అనే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గ్రామంలో మట్టి సేకరణ కార్యక్రమం చేపట్టారు అందులో భాగంగా సత్యవేడు నియోజకవర్గం నుంచి మట్టి సేకరణ కార్యక్రమం జరిగింది.

ఆర్టీసీ కార్మికుల నిరసన

విశాలాంధ్ర - చిత్తూరు: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్ పై జరిగిన దాడిని నిరసిస్తూ చిత్తూరు వన్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ఆదివారం నిరసన చేపట్టారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ పై కొందరు దుండగులు విశిక్షణారహితంగా దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

దేవర ఎద్దు మృతి

విశాలాంధ్ర - పాలసముద్రం : మండలంలోని రంగాపురం గ్రామంలో మల్లెంపాటి వంశీయుల దేవర ఎద్దు ఆదివారం నాడు స్వర్గ ప్రాప్తి పొందింది. అమ్మగారిల్లు అయిన పొదలి వంశీయులు సాంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలతో దేవర ఎద్దుకు పూజలు నిర్వహించి వేద పండితుల నడుమ పూజలు నిర్వహించి మేళ తాళాల మంగళ వాయిద్యాలతో బాణాసంచాలు పేలుస్తూ ఎంతో వైభవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

బోయకొండలో భక్తుల రద్దీ

అభివృద్ధి పనులు పరిశీలించిన పెద్దిరెడ్డి

విశాలాంధ్ర - చౌడేపల్లి : బోయ కొండ గంగమ్మ దర్శించుకోవడానికి ఆదివారం కర్ణాటక ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ఉదయం 6 గంటల నుండి భక్తులు బారులు తీరారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు మహిళలు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణల చేశారు. బోయకొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి పరిశీలించారు. త్వరలో భక్తులకు సౌకర్యంగా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులకు ఏలాటి ఇబ్బంది కలగకుండా తీర్ధ ప్రసాదాలు తాగునీరు అందరికీ అందేవిధంగా ఆలయ ఈవో చంద్రమౌళి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నూతన పాలక మండలి చైర్మన్ నాగరాజు రెడ్డి పాలక మండల సభ్యులు రాజేష్ పవన్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో వినూత్న నిరసన

విశాలాంధ్ర - రామకుప్పం : మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేశారని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని కెంచన బల్ల గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వినూత్న నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏ తప్పు చేయకున్నా ఎటువంటి ఆధారాలు లేకున్నా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ చంద్రారెడ్డి, గోవిందప్ప, రమేష్, రామాంజులు, హరికృష్ణ, శ్రీనివాసులు, మునిలక్ష్మమ్మ,సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నాయకులను శిక్షించాలి:ఏఐటీయూసీ

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ నందు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై అతి కిరాతకంగా దాడి చేసిన అధికార పార్టీ నాయకులను కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు సామాన్య ప్రజల అన్నా, ఆర్టీసీ డ్రైవర్ అయినా, అధికారులైన, పోలీసులైనా లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారని వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావలిలో ఆర్టీసీ డ్రైవర్ వెనుక వస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడి కారుకి దారి ఇవ్వలేదని డ్రైవర్ పై దాడి చేయడం అతి కిరాతకంగా కొట్టడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వ్యవహరించడం చాలా దుర్మార్గమని అతనిపై పోలీసులు కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిన్ యూనియన్ నాయకులు ఏఐటియు సి జిల్లా నాయకులు శ్రీరాములు. ఆవుల ప్రభాకర్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ చేయూత అభినందనీయం:కమిషనర్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : విభిన్న ప్రతిభావంతులకు హెల్పింగ్ హాండ్స్ చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రత్యేక ప్రతిభావంతులకు స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న సహాయంతో పాటు వారు స్వశక్తితో ఎదిగేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతి నెల ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు విచ్చేసి ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న సహాయంతో పాటు తాము స్వశక్తితో ఎదిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మున్నీరు భాష, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, రాజేశ్వరరావు, హరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ముందస్తుగా దీపావళి పండుగ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : టపాసులు పేల్చే సమయంలో చిన్న పిల్లలను ,మహిళలను దూరంగా ఉంచాలని విజ్ఞప్తి వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్లో ఎస్సై నాగార్జున రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ దీపావళి పండుగ ముందు రోజు గానీ దీపావళి పండుగ రోజు గానీ టపాసులు పేల్చే సమయంలో చిన్న పిల్లల పై నిఘా పెట్టాలని మహిళలు కూడా ప్రయోగాలు చేయకుండా పెద్ద పెద్ద టపాసులు కాల్చే ప్రయత్నం కూడా చేయకుండా వాటికి దూరంగా ఉండాలని, పండగ రోజు ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో సంతోషాలతో జరుపుకోవాలని పోలీసు శాఖ ఉద్దేశమని.అదేవిధంగా పండుగ ముసుగులో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పండగ పూట వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని హెచ్చరిస్తూ, మరోవైపు టపాసులు అమ్మే వారు కచ్చితంగా అనుమతులు ఉండాలని దుకాణాల వద్ద నిబంధనల ప్రకారం తగు జాగ్రత్తలు తీసుకోవాలని మా పర్యవేక్షణ కచ్చితంగా వాటిపై ఉంటుందని, ఎవరైనా అనుమతులు లేకుండా టపాసులు అమ్మిన తరలించిన చట్టం తన పని చేసుకుపోతుందని హెచ్చరించారు. ఏది ఏమైనా గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరిస్తూ పండగ పూట కుటుంబంలో సుఖసంతోషాలు నింపుకోవాలని ఇదే పోలీసు శాఖ కోరుకుంటుందని ఆయన తెలిపారు.

శ్రీకాళహస్తిలో 'ఏపి నీడ్స్ పవన్‌కల్యాణ్'
మొదటి రోజు జనసేన విజయ యాత్ర -పెద్ద ఎత్తున జనసైనికులు ర్యాలీ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఏపి నీడ్స్ పవన్ కల్యాణ్ అనే నినాదంతోజనసైనికులు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన విజయ యాత్రను చేపట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోటా భారీ ఎత్తున వేల మంది జనసైనికులు, నాయకులు, వీర మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. "జనసేన విజయ యాత్ర - ఏపి నీడ్స్ పవన్ కల్యాణ్ అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి ఈ రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ నాయకత్వం అవశ్యకతను తెలియజేస్తూ, వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ఆశీర్వదించాలని ప్రచారంలో భాగంగా మొదటి రోజు కార్యక్రమం భారీ ఎత్తున శ్రీకాళహస్తి పట్టణం ఏపీ సీడ్స్ సర్కిల్ నుండి నాలుగు మాడ వీధులు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం నియోజకవర్గ ముఖ్య నాయకులు, జనసైనికులు,మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతంకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గం నాలుగు మండలాల నుండి వేల సంఖ్యలో నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలి:ఎంప్లాయిస్ యూనియన్

విశాలాంధ్ర - నాయుడుపేట : ఆర్‌టిసిలో విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్‌పై కావలిలో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన గుండాలపై వెంటనే చర్యలు చేపట్టాలని సూళ్లూరుపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు.ఆదివారం డ్రైవర్‌పై దాడికి నిరసనగా నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజలను సురక్షితంగా గమ్యం చేర్చే ఆర్టీసీ డ్రైవర్లకు భద్రత కల్పించాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఘటనను చూస్తే ఉద్యోగస్తులపై గుండాగిరి ఇంత దారుణమా అనిపిస్తుందన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, వేరొకరికి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంతో పాటు ఆర్టీసీ యాజమాన్యం కూడా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నిరసనలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె. జయరాజ్, రాఘువులు, చలపతి, శ్రీరాములు, ఏ బి రెడ్డి మహిళా కండక్టర్లు పాల్గొన్నారు.

నారా లోకేష్ ను కలిసిన పోతుగుంట రాజేష్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను ఆదివారం హైదరాబాదులో శ్రీకాళహస్తీశ్వర ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు దివంగత పోతుగుంట గురవయ్య నాయుడు కుమారుడు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. నారా లోకేష్ కు పుష్పగుచ్ఛం అందచేసి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో రిమాండు ఖైదీగా ఉన్న నారా చంద్రబాబునాయుడు ఆరోగ్య పరిస్థితిని గురించి పోతుగుంట రాజేష్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఇక శ్రీకాళహస్తిలో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పోతుగుంట రాజేష్ నాయుడుకు నారా లోకేష్ సూచించారు. ఇందుకు పోతుగుంట రాజేష్ అంగీకరించారు. శ్రీకాళహస్తిలో టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి జెండా ఎగుర వేయడానికి తనవంతు కృషి చేస్తానని రాజేష్ హామీ ఇచ్చారు.

మన్ కీ బాత్ లో బీజేపీ నేతలు

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: భారతీయ జనతా పార్టీ తిరుపతి తూర్పు మండల గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇంచార్జి గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని దూరదర్శన్ లో చేసిన ప్రసంగాన్ని శక్తి కేంద్రాల ఇన్చార్జి గోపీనాథ్ రెడ్డి నివాసంలో వీక్షించారు. ప్రధానమంత్రి ఎన్నో మంచి విషయాలు తెలియజేశారని గోపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శక్తి కేంద్ర 82 బూత్ అధ్యక్షుడు బాబు, 83 బూత్ అధ్యక్షుడు ప్రసాద్, 84 బూత్ అధ్యక్షురాలు కళ్యాణి, 85 బూత్ అధ్యక్షులు రమణ, 86 బూత్ అధ్యక్షుడు చంద్ర, గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇన్చార్జ్ పరిధిలోని ముఖ్య నాయకులు, బీజేపీ తూర్పు మండల ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు మురళి, వేదవతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నగర పర్యావరణాన్ని కాపాడుతున్న గుజిరి వ్యాపారులు :కె.రాధాకృష్ణ

విశాలాంధ్ర - తిరుపతి : నగర ప్రజలు, కంపెనీలు, షాపులు వాడేసిన ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్, వాటర్ బాటల్స్ రక రకాల వస్తువులను సమీకరించి రీసైకిలింగ్ చేస్తూ పర్యావరణానికి మేలు చేస్తున్న గుజిరి వ్యాపారులపై అధికారుల దాడులను ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తున్నది.ఆదివారం ఉదయం 10 గంటలకు గంధమనేని శివయ్య భవన్ నందు తిరుపతి నగర గుజిరి వ్యాపారుల సంఘం (ఏఐటీయూసీ) మహాసభ రాము అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో 200పైగా గుజిరి వ్యాపారులు షాపులు ఉన్నాయని అందులో 2000 మందికి పైగా గుజిరి కార్మికులు తోపుడు బండ్లపై, రిక్షాలపై, ఆటోల్లో నగరంలోని పలు ప్రాంతాలలో ప్లాస్టిక్ బాటిల్స్ , వేస్ట్ ను సమీకరించి నాగరాన్ని సుబ్రపరచడంలో కార్పొరేషన్ అధికారులకు సహాయంగా ఉండడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ బాటిల్స్ భూమిలో కరగాలంటే వంద సంవత్సరాలు పడుతుందాన్నారు. ఈ ప్లాస్టిక్ బాటల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని కూడా అన్నారు. నగరంలో లక్షలాది మంది యాత్రికులు వాటర్ బాటిల్ వాడి పడేస్తుంటే వాటన్నిటిని సమీకరించి రీసైకిలింగ్ చేయడంలో గుజిరి వ్యాపారులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పాడైపోయిన సామాగ్రిను శుభ్రం చేస్తున్న వీరిని కార్పొరేషన్ అధికారులు గుర్తించి వ్యాపారానికి కావలసిన షెడ్లు నిర్మించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఈ అధికారులపై ఉందన్నారు.ఈ మహాసభలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, జిల్లా సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి సిహెచ్ శివకుమార్ గుజిరి వ్యాపారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి అల్ల బక్షు, దాము, అలీ బాషా, అజ్జిమ్, పళని, రాధాలత, బాలన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో విచ్చలవిడిగా మట్టి మాఫియా - ప్రశ్నించిన వారిపై దాడులు
అడ్డు అదుపు లేని అధికార పార్టీ నాయకుల ఆగడాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా రెచ్చ పోతోంది అవకాశాలే హద్దుగా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు . మామూళ్ల మత్తులో మునిగితేలుతున్న అధికారులు తమ మొబైల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని కోమాలోకి వెళ్ళిపోతున్నారు . ఇదే అదునుగా భావించిన కొంతమంది అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ(మట్టి మాఫియా) విచ్చలవిడిగా గ్రావెల్ విక్రయాలు కొనసాగిస్తున్నారు . అధికార పార్టీ పేరు చెప్పడంతో అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు .నియోజకవర్గానికి అనుబంధమైన తొట్టంబేడు మండలంలోని గుండేలు గుంట , శివనాదపాలెం పంచాయతీ పరిధితో పాటు మండలంలోని అనేక పంచాయతీల్లో ఈ మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకీ సృతిమించుతున్నాయి . తద్వారా పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయం . దీంతో అధికార పార్టీని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా కొంతమంది దుర్వినియోగానికి పాల్పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది . ఈ కోణంలోనే ఇటీవల ఓ దళిత వ్యక్తిపై అధికార పార్టీలోని దళిత సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు దళిత యువకులు దాడి చేసినా స్థానిక శాసనసభ్యుని దృష్టికి తీసుకు వెళ్లకుండా కట్టడి చేశారు . ఇలాంటి సంఘటనలు కోకొల్లలు నియోజకవర్గంలో జరుగుతున్నాయి . ఈ కారణంగా స్థానిక శాసనసభ్యునికి దళిత సామాజిక వర్గం లోని ఓటు బ్యాంకు దూరమవుతోంది. ఇటు అధికారులు అటు స్థానిక పార్టీ నాయకుల నిర్వహణ కారణంగా పార్టీకి తీవ్రఅన్యాయం జరుగుతోంది .ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

26మంది టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు
ఏ1గా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు సీఐ అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు 26మంది తెలుగుదేశం పార్టీ నేతలపై శనివారం రాత్రి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1గా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని చూపారు. ఇక ఏ2గా రంగినేని చెంచయ్యనాయుడు, ఏ3గా రావిళ్ల మునిరాజా నాయుడు, ఏ4గా కాసరం రమేష్, ఏ5గా చక్రాల ఉష, ఏ6గా సుబ్బయ్య, ఏ7గా కుమారి, ఏ8గా రాజేష్, ఏ9గా రవీంద్రరెడ్డి, ఏ10గా బషీర్ తో పాటు శ్రీనివాసులు, మిన్నల్ రవి, సన్నీ డియోల్, కోబాక లక్ష్మణ్, బాలాజీ రెడ్డి, కంఠా రమేష్, బాలాజీ, ఎ:ఎంవాడ గోపి, వజ్రం కిషోర్, గోపి, చుక్కల రమేష్, జనసేన నేత కొట్టే సాయి, బాబు నాయుడు, చెంచయ్యనాయుడు, శ్రీనివాసులు నాయుడు, క్రిష్ణమనాయుడుపై ఈ కేసు నమోదు చేశారు. కొస మెరుపు ఏమిటంటే ఇందులో కొంతమంది ఎస్సీ, ఎస్టీ నేతలపై కూడా అట్రాసిటీ కేసు పెట్టడం. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు ఇటీవల జగనాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో కూడా ఈ నిరసన కార్యక్రమం చేశారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కమ్మకొత్తూరుకు వెళ్లి నిరసన తెలిపిన గ్రామీణులపై కేసులు పెడతామంటూ బెదిరించారు. ఇదే గ్రామంలో చెంచయ్యనాయుడు అనే వృద్ధుని పోలీసులు చితక బాదారు. ఇలా చేయడంతో ఆయన పోలీసులను నిలదీశారు. తనపై పోలీసులు దాడి చేసిన విషయాన్ని చెంచయ్యనాయుడు తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఐ అజయ్ కుమార్ కు ఫోన్ చేశారు. చెంచయ్య నాయుడును ఎందుకు కొట్టారని ప్రశ్నించారు. ఇందుకు ఆగ్రహించిన సీఐ అజయ్ కుమార్ టీడీపీ ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని పరుష పదజాలంతో దూషించారు. దీంతో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి టీడీపీ శ్రేణులతో కలసి శనివారం శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. సీఐ అజయ్ కుమార్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా నేపథ్యంలో తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి జోక్యం చేసుకున్నారు. సీఐ అజయ్ కుమార్ తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ హామీతో టీడీపీ శ్రేణులు ధర్నా విరమించారు. అయితే పోలీసులు సీఐ అజయ్ కుమార్ పై చర్యలు తీసుకోకుండా నిరసన తెలిపిన టీడీపీ శ్రేణులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విధులకు ఆటంకం కలిగించారని తదితర సెక్షన్ల కింద శ్రీకాళహస్తి రెండవ పోలీసు స్టేషన్ సీఐ మల్లికార్జున కేసు నమోదు చేశారు. ఒకేసారి 26మంది టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. అన్యాయంగా కమ్మకొత్తూరు వాసులను చితక బాదిన సీఐ అజయ్ కుమార్ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి... న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై అట్రాసిటీ కేసు పెట్టడం ఎంతవరకు న్యాయమని టీడీపీ శ్రేణులు వాపోతున్నాయి.

చిత్తూరు జిల్లా సాంస్కృతిక జీవనానికి ప్రతీక సభా కథలు
మా కథలు -2022 పుస్తక పరిచయం

విశాలాంధ్ర-తిరుపతి: చిత్తూరు జిల్లాలో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా రచయిత కె. సభా కథలు రచనా వ్యాసంగం చేశారని ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోగల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కె.సభా సంస్మరణ సభ, మా కథలు -2022 కథా సంకలనాన్ని ఆవిష్కరించారు.డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ స్వాగత పరిచయంతో డాక్టర్ సాకం నాగరాజ సభాధ్యక్షతన,ఆకుల మల్లేశ్వరరావు నిర్వహణలో సాయంత్రం 5:30 గంటలకు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మధురాంతకం నరేంద్ర, ఖాదర్ మొహియుద్దీన్ లు హాజరై చిత్తూరు జిల్లా మేటి రచయితల్లో సభా ఒకరిని, వీరు రచనల్లో జిల్లా సాంస్కృతిక చరిత్ర , వైభవం,భాష, మాండలికాలు ప్రతిబింబించేలా ఉంటాయని వారిని స్మరించుకోవడం శుభపరిణామం అన్నారు.

ఆత్మీయ అతిథులు పలమనేరు బాలాజీ, కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఎందరో కవులు,రచయితలు రాసిన రచనలు అమూల్యమైనవని మరణించిన వారి రచనలు మననం చేసుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం మనందరి మీదా ఉందని గుర్తు చేశారు.అలాగే మా కథలు -2022 పుస్తకంలోని కథలు సమీక్షించారు.ఈ కార్యక్రమంలో రచయిత, పాత్రికేయులు ఆర్.యం.ఉమామహేశ్వర రావు, తమటం రామచంద్రారెడ్డి, కలువగుంట రామమూర్తి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి,పల్లిపట్టు నాగరాజు, కాంతారావు, సురేంద్ర రొద్దా పాల్గొన్నారు

డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ ప్రాంతంలోని ఆదివారం సాయంత్రం విలేకర్ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టిఎన్‌టియుసి అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు ఆయన మాట్లాడుతూ కావలిలో జరిగిన ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ పై దాడిని ఖండిస్తూ ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసిపి గుండాలను వెంటనే అరెస్టు చేయాల్సిందిగా కోరుతూ, ఈ వైసీపీ పాలన లో ఏ యొక్క కార్మికుడికి భద్రత లేదని, రోడ్డుకు అడ్డంగా నిలిపిన వైసీపీ గుండాల కారుని ప్రక్కకు పొమ్మని ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ హారన్ కొట్టడంతో కారులోని గూండాలు మరియు స్థానిక వైసిపి నాయకులు అందరూ కలిసిడ్రైవర్ని చాలా దారుణంగా కొట్టడం జరిగింది. అందుకు కారకులైన వైసీపీ గూండాలను వెంటనే అరెస్టు చేసి కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు బాలకృష్ణయ్య, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన

విశాలాంధ్ర - రామచంద్రాపురం : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటకు రావాలని కోరుతూ తెలుగు దేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో రాయలచెరువు గ్రామంలో నిజం గెలవాలి సైకో పోవాలి సైకిల్ రావాలని కోరుతూ తెలుగు తమ్ముళ్లు కళ్ళకు నల్లని గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు ఈసందర్భంగా తిరుమల రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు పై రాజకీయ కక్ష తోనే కేంద్ర ప్రభుత్వం అండదండలతో అక్రమ కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టారని మచ్చలేని మహా నాయకుడు చంద్రబాబు నాయుడు బైటికి రాకుండా జగన్ మోహన్ రెడ్డి కుట్రలు పన్నినా న్యాయం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్లు మేకల మాదవి యస్ నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరసింహ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మాదవయ్య లోకనాథం యాదవ్,నాథముని యాదవ్,రోసిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు

నేడు డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల మున్సిపల్ సమస్యలపై మున్సిపల్ మేయర్, కమిషనర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసే "డయల్ యువర్ కమిషనర్", స్పందన కార్యక్రమాలను సోమవారం (నేడు) నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పీఆర్వో కల్లుపల్లి సురేంద్ర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం అదేవిధంగా అర్జీలు, ఫిర్యాధులు ఇచ్చేవారి కోసం ఉదయం 10:30 నుండి "స్పందన" కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా ఫిర్యాధులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవల్సిందిగా తిరుపతి ప్రజలకు వినతి చేశారు.

ఆటోరంగ కార్మికులను ఆదుకోండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆటోరంగ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు గోపి నాయుడు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆటోనగర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి నాయుడు మాట్లాడుతూ 40ఏళ్లుగా సుమారు 500 కుటుంబాలు ఆటో మెకానిక్ కార్మికులుగా జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఏ ఒక్క కుటుంబానికి కూడా సొంతిల్లు లేదన్నారు. పాలకులు మారుతున్నారని సొంతింటి కల నెరవేరిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా ఆచరణలో మాత్రం పెట్టడం లేదని ఆయన వాపోయారు. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు తమవని... రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా మమల్ని వాడుకుంటుండటం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మాధుసూదన్ రెడ్డికి దృష్టికి ఆటో రంగ కార్మికుల సమస్యలను తీసుకెళ్లామన్నారు. ఆయన పెద్ద మనసుతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్, ముని గోపాల్, సాదిక్ బేగ్, సుబ్రమణ్యం, తిరుపాల్ రెడ్డి, గోపాల్, మీర్జాన్ బేగ్ చిరంజీవులు, చెంగల్ రాయలు, మునికృష్ణ, గోపి, మణినాయుడు, మహేష్ పాల్గొన్నారు.

గూడూరులో నిజం గెలవాలి కార్యక్రమం

విశాలాంధ్ర - గూడూరు : నారా చంద్రబాబు నాయుడు అక్రమ రిమాండ్ కు నిరసనగా గూడూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిజం గెలవాలి న్యాయం గెలవాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులందరూ కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. జగనాసుర చీకటి పాలనకు నిరసనగా పార్టీ కార్యాలయంలో నాయకులతో కలసి కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలని గట్టిగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండలం పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, దువ్వూరు రవీంద్ర రెడ్డి, మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, తాళ్ళ సుబ్బమ్మ, శ్రీదేవి, సుబ్బరత్నమ్మ, లక్ష్మీ, సుధ, ఇశ్రాయేలు కుమార్, రహీమ్, యువత సునీల్, సందీప్, పార్వతయ్య, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ కళ్ళు తెరిపిద్దాం:టీడీపీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఏపీలో వైసీపీ గుడ్డి ప్రభుత్వం అందిస్తున్న చీకటి పాలన అంతమై ప్రజారంజకమైన ప్రశాంతతను తిరిగి నెలకొల్పడానికి జగన్మోహన్ రెడ్డి కళ్ళు తెరిపిద్దాం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను నియంత్రిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలలో భాగంగా నిజాన్ని గెలిపించడానికి జగన్మోహన్ రెడ్డి 'కళ్ళు తెరిపిద్దాం' అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని జయరాంరావు వీధిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు కళ్లకు గంతలు కట్టుకొని నిజం గెలవాలని నినాదాలు చేశారు. తనకు ప్రత్యర్థులే ఉండకూడదనే దురాశతో దాడులు దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అంధకారం లోకి నెట్టివేస్తున్న జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పి, అతని కళ్ళు తెరిపించడానికి యావత్ తెలుగు ప్రజలు కంకణబద్దులు కావాలని దశరధాచారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీసీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, రైతు విభాగం తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు ప్రకాశ్ నాయుడు, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, మాజీ వైస్ ఛైర్మన్ షేక్ ఖాదర్ బాషా, తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు మణి, వంశీకృష్ణ, రామచంద్రయ్య, గంగనపల్లి రమేష్, కంభంపాటి గిరిబాబు, చెంబేటి బాలయ్య, డి.శివ, మైనారిటీ విభాగం నాయకులు అస్మత్ తదితరులు పాల్గొన్నారు.

కాంపాళ్యం లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని కాంపాలెం గ్రామంలో ఆదివారం సి ఎస్ ఐ చెన్నై వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం పాస్టర్ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించారు. చెన్నై ప్రాంతం రాయపురం పరిశుద్ధ లూకా చర్చి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరం మండల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరానికి సుమారు 400 మంది రోగులు హాజరయ్యారు. మధుమేహ వ్యాధి, కంటి వ్యాధి, దంతవ్యాధి, రక్తపోటు వ్యాధి, గ్యాస్ట్రిక్ సమస్య భుజం నొప్పులు, ఆల్సర్, వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. పాస్టర్ ఆశీర్వాదం ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కొరకు వైద్యం అందించడానికి సిఎస్ఐ చర్చి వారు ఉచిత సేవలు అందించడానికి వారు ఆసక్తి చూపడంతో మండలంలోని పేద వారిని గుర్తించి కార్పొరేట్ వైద్యం అందించడానికి ముందుకు వచ్చారన్నారు, మండల ప్రజలు ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ ప్రకాష్, డాక్టర్ దీపక్, డాక్టర్ స్టీఫెన్, డాక్టర్ డేవిడ్, డాక్టర్ నాగ ప్రియాంక, డాక్టర్ ప్రశాంత్, ఉచిత వైద్య సేవలు అందించారు.